


# నవ్వు

వి. ఎస్. చెన్నూరి

సంతకం పెట్టి, టెలిగ్రామ్ అందుకున్నాను.

ఎవ రిచ్చారో? ఏముందో అందులో?

కవరు విప్పందే తెలీదు.

ఎలా విప్పడం? టెలిగ్రామ్ వచ్చింది నాకు కాదు. రాజారావుకి!

కొంపదీసి, ఏ దగ్గిర బంధువో బండెక్కడానికి సిద్ధమవడం లేదు కదా? ఏ ఆత్మీయుడో అమాంతం టిక్కెట్టు పుచ్చుకుని చెక్కెయ్య లేదు కదా?

ఛీ! ఛీ! ఏమిటి నా ఆలోచనలు!

రాజాలాంటి రాజారావుకి, ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ హైలాపచ్చీసుగా తిరిగే రాజారావుకి అలాంటి వార్త అందడ మేమిటి?

తాను బయలుదేరుతున్నాననీ, సికింద్రాబాద్ స్టేషన్‌లో తన్ను తప్ప కుండా రిసీవ్ చేసుకోవలసిందనీ ఏ పాత స్నేహితురాలో టెలిగ్రామ్ ఇచ్చి ఉంటుంది! లేదా, పండక్కి తప్పకుండా ఇంటికి రావలసిందనీ, నీ రాక కోసం వదినెలు, మరదళ్లు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూంటారనీ మామగారు ఆహ్వానం పంపి ఉంటారు!

అవును, అలాంటివాళ్లకి అలాంటి వార్తలే అందుతాయి. కష్టాలు వాళ్ల చెంత చేరవు. అదృష్టవంతులు!

కాకపోతే ఎప్పుడూ అలా ఎలా నవ్వ గలుగుతాడు?

వెధవనవ్వు! నవ్వంటే నాకు పరమ రోత!

నేను నవ్వలేను! ఎదటివాడు నవ్వు తూంటే చూచి ఓర్చుకోలేను. ఒళ్లంతా తేళ్లు, జెర్రులు పాకినట్టుంటుంది. ఉడుకుమోత్తనం!

ఊహూఁ, కాదు. జాలి!

అవును! పాపం, వాళ్లకేం తెలుసు జీవితమంటే? కష్టాలంటే ఏమిటో ఎరగని అర్భకులు వాళ్లు!

కాకపోతే పళ్లన్నీ బయటపెట్టి అలా ఎలా నవ్వగలుగుతారు?

ఇంతకీ ఏముందో ఇందులో?

టెలిగ్రామేగా? విప్పితే పోలా?

ధైర్యం చేసి కవరు విప్పాను. ఒకటికి రెండు సార్లు చదువుకున్నాను. కళ్లు తిరిగి కింద పడిపోతానేమో ననిపించింది. కాని పడలేదు. 'ఒరేయ్, రాజారావ్! నీ కెంత కష్ట మొచ్చిందిరా?' బావురుమని ఏడుద్దా మనుకున్నాను. కాని, ఏడవలేదు.

తమాయించుకున్నాను.

టెలిగ్రామ్ మడిచి కవర్లో పెట్టాను.

ఎప్పుడూ నవ్వే ఆ వెధవమొహం ఇప్పు డెలా ఏడుస్తుందో చూడాలనిపిం చింది.

వెధవమనను! ఏమిటో, అలాంటి కోరికలే కోరుతుం దెప్పుడూ!

అంతలో వాడే వచ్చేశా డక్కడికి.

"ఒరేయ్, రాజారావ్! నీ కేదో టెలిగ్రామ్ వచ్చిందిరా! ఎక్కణ్ణించో ఏమో చూద్దామనుకుంటుండగా నువ్వే వచ్చేశావు. ఏమిటో చూడు!" అనుకో కుండానే అబద్ధమాడేసింది అలవాటు పడ్డ నోరు.

రాజారావు అందుకున్నాడు టెలిగ్రామ్‌ని. మామూలుగానే చదివేసి, ఓ వెర్రినవ్వు నవ్వేశాడు. వెధవనవ్వు!

కొరడాతో వీపుమీద ఛెళ్లుమనిపించి నట్టు ఉలిక్కిపడ్డాను.

"ఏమిట్రా? ఏమిటది?" క్వొశ్చెన్ మార్క్ ముఖం పెట్టాను.

"ఏముందిరా! మంచమెక్కిన మామ్మ గారు మనమణ్ణి చూడందే వెళ్లనని మంకుపట్టు పట్టి కూర్చుందిట!' గొల్లుమని నవ్వేశాడు రాజారావు.

ఛీ! వెధవనవ్వు! ఏం మనుషులు వీళ్లు? ఏడవడంకూడా చాతకాని మనుషులు! నేనైతే ఎంచక్కగా ఏడ్చేద్దును!

రాజారావు సెలవు చీటీ రాసుకుని మేనేజర్ దగ్గిరికి బయల్దేరాడు.

ఏమి టా పోజు? వెధవపోజు?

సెలవు గ్రాంట్ చేయించుకునేందుకు కూడా నవ్వే? వెధవనవ్వు?

అసలే కర్కోటకుడు మేనేజర్! కనీసం రెండు కన్నీటిబొట్లయినా రాల్చందే కరుగుతుందా వాడి రాతిమనస్సు?

ఏం మనుషులో వీళ్లు?

ఎలా బతుకుతారో ముున్ముందు?

కానీ, కానీ, వాడి వెధవనవ్వుకే సొళ్లై పోయి, సెలవు గ్రాంట్ చేసేశాట్ట కర్కోటకుడు!

ఏమిటి చెప్మా చోద్యం?

రాజారావుగాడు ఎంతయినా నా మిత్రుడు!

కాంటీన్‌లో ఎన్ని కప్పుల కాఫీ తాగాను వాడి డబ్బుతో! ఎన్నిమార్లు వాడుకున్నాను చేబదుళ్లు వాణ్ణి అడిగి?

వాడికి వచ్చిన ఈ కష్టానికి నాలుగు సానుభూతి వాక్యాలు పలకాలనుంది! ఓదార్చాలనుంది! కాని, ఎలా?

వాడు ఒక్కసారి ఏడిస్తే ఎంత బావుణ్ను!

అందుకనే వాడంటే నా కంత అసహ్యం! కాదు, ఉడుకుమోత్తనం!

( తరువాయి 53వ పేజీలో )

# మేరువు

( 31 వ పేజీ తరువాయి )

ఎంతయినా స్నేహితుణ్ణి కదా, ఆ మాత్రం అవకాశం నాకు కలిగిస్తే వా డబ్బ సొత్తేం పోయింది?

ఉడుక్కుంటూనే వెళ్లి, వాణ్ణి రైలెక్కించి వచ్చాను.

వాడులేని ఆ వారం రోజులు ఆఫీసంతా చిన్నబోయింది. ముఖ్యంగా లంచ్ టైములో అందరికీ కనిపించేది వాడు లేని కొరత. అందరి టిఫిన్ కారియర్లూ తెరిచేవాడు. అన్ని టిఫిన్లూ రుచి చూచే వాడు. అందరికీ కాఫీలు పోయించేవాడు.

అంత చనువు, చొరవ అందరికీ ఎలా వస్తాయి?

**డబ్బంటే వాడికి మంచినీళ్ల ప్రాయం!**

పెట్టి పుట్టాడు. కనకనే అంత గొప్పింటి పిల్లని చేసుకోగలిగాడు. మామ గారు ఎంత లక్షాధికారి కాకపోతే, పెళ్లాన్ని పుట్టింట విడిచిపెట్టి వీ డిక్కడ పైలా పచ్చీసుగా తిరుగుతూంటే చూస్తూ ఊరుకుంటాడు!

ఎంత లక్షాధికారి అయితే మాత్రం ఎంతకాలం మేపుతాడు, పెళ్లయిన పిల్లని ఇంట్లో పెట్టుకుని?

అప్పుడు తెలిసొస్తుంది అయ్యగారి పని!

బాధలూ, బాధ్యతలూ నెత్తిన పడందే వీడి రోగం కుదరదు!

అప్పు డిక నవ్వుతాడు. నవ్వు! వెధవ నవ్వు!

వారం రోజులు పూర్తి అయినా వాడు రాలేదు. వాడి స్థానే వాడు రాసిన ఉత్తరం వచ్చింది ఆఫీసుకి. వా డక్కడికి చేరకముందే వాడి మామ్మ టిక్కెట్టు పుచ్చుకుని చెక్కేసిందనీ, కర్మక్రతువు లయ్యేదాకా ఉండక తప్పడంలేదనీ, మరో నాలుగు రోజులు సెలవు గ్రాంట్ చెయ్యవలిసిందనీ రాశాడు.

వా డక్కడికి చేరకముందే నాడి మామ్మ టిక్కెట్టు పుచ్చుకుని చెక్కేసిందట! వాడికి కావలిసిందే!

లేకపోతే, ఏమి టా వెధవపోజూ, వెధవ నవ్వూను?

'మామ్మ మంచమెక్కిం'దని టెలిగ్రామ్ వస్తే, 'మంచ మెక్కిన మామ్మ మళ్లీ దిగకపోతుందా?' అన్న దీమాతో అంతలావు నవ్వు నవ్వేశాడు పళ్లన్నీ బయట పెట్టేసి. అబ్బాయిగారి తిక్క బాగా కుదిరింది.

కాని, చిత్రమేమిటంటే సెలవు పూర్తి చేసుకుని ఆఫీసు చేరుకున్న రాజా రావుగాడు ఒక్క కన్నీటిబొట్టు కార్చిన పాపాన పోలేదు.

వట్టి కృతఘ్నుడు!

ఆ మామ్మ వాళ్లమ్మని తొమ్మిది మాసాలూ మోసి, కని ఉండకపోతే, వాళ్లమ్మ వాణ్ణి కని ఉండేదా? అలాంటి మామ్మ స్వర్గస్థురాలైతే వీడు చూపించే కృతజ్ఞత ఇదేనా?

అసలు వాణ్ణి అని మాత్రం లాభ మేమిటి?

అంతా ఆ లచ్చితల్లి మహత్యం!

ఆమె అండ లభిస్తేచాలు కన్నూ మిన్నూ కనిపించ వీ నడమంత్రపుసిరి గాళ్లకి. కళ్లు నడినెత్తి కెక్కుతాయి. ఇక ధర్మాధర్మాలు కూడానా?

రాజారావుగాడు రాజాలాగా బ్రతుకు తున్నాడు.

తెల్లని టెరికాట్ పాంటూ, మల్లెపువ్వు లాంటి పొడుగు చేతుల చొక్కా, టకస్ చేసి, టై కట్టి దొరబిడ్డలా తయా రౌతాడు.

కాళ్లకి బూట్లూ, కళ్లకి గాగుల్సూ... అబ్బో! ఏం విరగబాటు? ఏం తిరగబాటు?

పైగా ఆ నవ్వుకూడా! వెధవనవ్వు!

ఆ సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి మామూలుగా ఎదురువచ్చే చంటివాడు అయిపులేడు.

'ఏమయ్యాడు చెప్మా?' గుండెలు ఎగదోసుకుంటూ గుమ్మంలోకి చేరుకునే సరికి శ్రీమతి ఎదురువచ్చి చెప్పవలిసిన శుభవార్త కాస్తా చల్లగా చెవిని పడేసింది!

చంటివాడికి జలుబు చేసిందిట. చేసింది చాలక జ్వరంకూడా కాస్తూందిట!

'హరి భగవాన్! ఎంత'పని చేశావురా? లోకంలో ఉన్న కష్టాలన్నీ నా లాంటి వాళ్ల కోసమే ప్రత్యేకించి పెట్టావా?'

జారిన గుండె ఎగదోసుకోలేక కుర్చీలో చతికిలబడ్డాను.

"బెల్లం కొట్టిన రాయిలా కూచుండి పోయారేమిటండీ? పిల్లవాణ్ణి డాక్టర్ దగ్గిరికి తీసుకుపోదామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ఎక్కడయినా పది రూపాయలు పుట్టించుకు రండి!" హుకుం జారీ చేసింది శ్రీమతి.

పాడు జిడ్డుమొహం అదీను! దాన్ని చేసుకుని ఎప్పుడు సుఖపడ్డాను నేను? పైగా ఆర్డర్లు కూడాను! ఆర్డర్లు!

ఇంకా నయం, 'రేపు బాంకు కెళ్లి పాతిక రూపాయలు డ్రా చేసుకురండి' అంది కాదు. దానికీ తెలుసు—రేపు ఆదివారం అన్న సంగతి. లేకుంటే అంత మాటా అనేదే!

రెండు వందలు సంపాయించే వాణ్ణి యాభై రూపాయలు వెనకేసు కుంటే దాని కళ్లు పగులుతాయి. రేపేదయినా ముంచుకు వస్తే ఆదుకునే వాళ్లెవరు? ఆమాత్రం జ్ఞానం ఉండక్కర్లా?

పైగా నీతులు చెప్పొస్తుంది! నీతులు!

'అవసరాని కుపయోగపడని డబ్బు ఉంటేనేం, లేకపోతేనేం?' అని. ఆమాత్రం నాకు తెలీదా ఏమిటి?

ఇంతకీ ఇప్పుడు పది రూపాయలు ఎక్కడ పుట్టించను చెప్మా!

ఊపిరి ఆడటం లేదు. బుర్ర పని చెయ్యడం లేదు. అందరికీ నెలాఖరే నాయె! ఎవర్ని అడగను?

**కష్టాలు మనుషులకే వసాయి. మనుషలనే బాధిస్తాయి. వాటిని భరించే శక్తి మాత్రం పరిమితంగా ఉంటుంది. కనకనే కష్టాలను ఆత్మీయులతో పంచుకొని కొంతమట్టుకు అయినా ఉపశమనం పొంది జీవితయాత సాగిస్తూ ఉంటారు పలువురు. ఆ విధంగా తెలియకనే ఇతరులను బాధిస్తూ ఉంటారు. ఆత్మీయులకు సైతం తెలియకుండా కష్టాలను కడుపులో దాచుకొనడం ఎంత కష్టం!**

రాజారావు తళుక్కున మెరిశాడు బుర్రలో.

శ్రీమతి అందించిన కాఫీనీళ్లు గొంతులో పోసుకుని బయలుదేరాను వాడి గదికి.

గది తలుపులు మూసి ఉన్నాయి. తాళంకప్ప వేలాడుతూంది.

విలాసపురుషుడు ఏ సినిమా హాల్లో ఉన్నాడో! ఎలా కలుసుకోను?

పక్కగది పద్మారావు కనిపించి చెప్పాడు—కౌన్సిలర్ కామేశంగా రింట్లో దొరకవచ్చని.

కౌన్సిలర్ కామేశంగా రింటికి ఎందుకు వెళ్లాడు చెప్మా!

కామేశంగారు వీడికి బంధువా? స్నేహితుడా? పరిచయస్థుడా? ఇప్పుడు వీ డక్కడికి ఎందుకు వెళ్లినట్టు?

ఆలోచిస్తూనే నడవసాగాను.

కామేశంగారి ఇల్లు ఎదురయింది.

కాంపౌండ్ గేటుముందు కనిపించిన నౌఖరు నారాయుణ్ణి అడిగాను, "రాజారావు ఇక్కడికి వచ్చాడా?" అని.

"ఎవరు? ప్రైవేటు మాస్టారు రాజారావుగారా? ఉదయం వచ్చి వెళ్లారండి!"

"ప్రైవేటు మాస్టారు కాదయ్యా దేవుడా? జె. రాజారావు, అంటే ఈ వీధి చివర పచ్చ మేడ ఉంది చూడూ! అందులో ఓ గదిలో ఉంటున్నాడు."

"ఆయనేనండి! అమ్మాయిగారికి ప్రైవేటు చెబుతున్నారులెండి! లాయర్ విశ్వనాథంగారి ఆఫీసుకి వెళితే దొరక వచ్చు!"

ఏమిటీ? కౌన్సిలర్ కామేశంగా రమ్మాయికి ప్రైవేటు చెబుతున్నాడా? ఎవడు? నవ్వుల రాజారావుగాడే! ఎంత ధైర్యం వీడికి? అసలు వీడికి పెళ్లి అయిందన్న సంగతి కామేశంగారికి తెలిదేమో!

పెళ్లాన్ని పుట్టింట విడిచిపెట్టి ఇదన్నమాట వీ డిక్కడ చేస్తూన్న నిర్వాకం! ఓరి త్రాష్టుడా! ఎన్ని గుండెలు వీడికి?

లాయర్ విశ్వనాథంగారి ఆఫీసుకి వెడితే దొరకవచ్చట!

వీ డక్కడి కెందుకు వెళ్లినట్టు?

కొంపతీసి ఏదయినా లిటిగేషన్‌లో పడ్డాడా ఏమిటి?

ఏముంటుంది, చెప్మా?

ఆలోచిస్తూనే విశ్వనాథంగారి ఆఫీసు వద్దకి చేరుకున్నాను. గుమాస్తా గోపాలం గారు హడావిడిగా పంచె ఎగబట్టుకుని ఎక్కడికో వెళుతూ ఎదురువచ్చారు.

"రాజారావు, అంటే జె. రాజారావు ఇక్కడికి వచ్చాడాండీ?" అడిగాను.

"వచ్చాడు, వచ్చాడు. వచ్చి ఇప్పుడే వెళ్లిపోయాడు. టైపు చెయ్యవలిసిన కాగితాలు ఏమీలేవులెండి!" అంటూ ఆగకుండా వెళ్లిపోయారు గుమాస్తా గోపాలంగారు.

టైపు చెయ్యవలిసిన కాగితాలేమీ లేవంటా డేమిటి?

గోపాలంగారు అసలే కంగారు మనిషి. పైగా హడావిడిగా ఎక్కడికో వెళు

తున్నాడుకూడా. ఏదో పలవరించాడు. ఏ ధ్యాస నున్నాడో మానవుడు!

ఉసూరుమంటూ వెనక్కి తిరిగాను.

కౌన్సిలర్ కామేశంగారు సామాన్యులు కారు. ఆయన తలుచుకుంటే రాజారావు ఈ ఊళ్లో ఉండలేడు!

వాడికి చెప్పాలి. ఎంతయినా స్నేహితుడు!

ఆలోచిస్తూనే నడుస్తున్నాను.

బరువుగా, బలంగా పడిందో చెయ్యి భుజంమీద. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. రాజారావు!

"ఇలా వచ్చావేమిట్రా?" నవ్వుతున్నాడు.

వెధవనవ్వూ వాడూను!

అరికాలి మంట నెత్తికెక్కింది. దులిపేద్దామనుకున్నాను. అయినా, ఇది సమయం కాదు. వెళ్లిన పని బయటపెట్టాను.

"ఈ మాత్రానికి ఇంత దూరం రావాలిట్రా? ఆఫీసులోనే అడిగి పుచ్చుకోకపోయావా?" అంటూ పర్సు తెరిచి, పదిరూపాయల నోటు తీసి చేతిలో పెట్టాడు.

"వెళ్లొస్తా!" అంటూ వెనక్కి తిరిగాను.

ఆదివారం గడిచిపోయింది.

ఆ మరుసటి రోజు మా ఆవిడ ప్రయర్ శాంక్షన్ లేకుండా కాజువల్ లీవు తీసేసుకుంది.

చంటివెధవనీ, సముద్రంలాంటి సంసారాన్నీ నా యెదాన వేసి మా ఆవిడ మహారాణిలా మూల కూర్చుంది.

'గుండెలో కొండలు దొర్లించిన ట్టయింది.

చకచకా సెలవుచీటీ రాసుకుని ఆఫీసుకి పరిగెత్తాను. మేనేజరు కాళ్లు పట్టుకుని, మూడు రోజులు సెలవు గ్రాంట్ చేయించుకునేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది.

అంట్లు తోమాలి! ఇల్లు సర్దాలి! బట్టలుతకాలి! వండాలి! చంటాణ్ణి డాక్టర్ దగ్గిరికి తీసుకువెళ్లాలి!

అబ్బబ్బబ్బ! ఏం సంసారమో! యమలోకం నయం!

రాజారావులాంటి పైలాపచ్చీసుగాళ్లకీ బాదరబందీ లేదు. అదృష్టవంతులు!

అందుకే వాడంటే నా కంత ఈర్ష్య! ఒళ్లుమంట! ఉడుకుమోత్తనం!

రెండు రోజులపాటు గొడ్డుచాకిరీ చేసినతరవాత మూడవ రోజు కాస్త ఊపిరి పీల్చుకోవటానికి వ్యవధి చిక్కింది.

రాజారావు నెలాగయినా కలుసుకోవాలి! నయానో, భయానో నచ్చచెప్పి, కౌన్సిలర్‌గా రమ్మాయికి ట్యూషన్ చెప్పడం వాడిచేత మానిపించెయ్యాలి. వాడు గదిలోనించి బయటపడక ముందే వెళ్లి కలుసుకోవాలి.

సాయంత్రం అయిదయింది. రాజారావు గదికేసి బయలుదేరాను. తీరా గది వద్దకి చేరుకునేసరికి మూసిన తలుపులూ, తాళంకప్పా దర్శనమిచ్చాయి.

ఆఫీసులోంచి ఇంకా రాలేదు కాబోలు!

గదిముందు వరండాలో పచార్లు చేస్తూ వాడి కోసం ఎదురుచూస్తున్నాను.

"ఎవరి కోసం, బాబూ, రాజారావు కోసమేనా!" ఇంటి యజమాని ఈశ్వరయ్యగారు పలకరించారు.

"అవునండి! రాజారావు కోసమే!" అన్నాను.

"మీకు తెలీదా?" ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూశారు ఈశ్వరయ్యగారు. "మీ రీపూట ఆఫీసుకి వెళ్లలేదా?"

"లేదు, మాస్టారూ! సెలవులో ఉన్నాను."

ఈశ్వరయ్యగారు బరువుగా నిట్టూర్చారు.

వారి ముఖం చూస్తూంటే నాకెందుకో భయం వేసింది.

"పాపం, అతని భార్యకి ప్రమాదంగా ఉందని టెలిగ్రామ్ వచ్చిందిట. మధ్యాహ్నమే బయలుదేరి వెళ్లిపోయాడు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్లుతూ హుషారుగా కనిపించేవాడు. ఎన్ని కష్టాలనయినా చిరునవ్వుతోనే ఆహ్వానించేవాడు. ఎన్ని బాధలయినా సంతోషంగానే భరించేవాడు. ఆ ముఖంలో ఎప్పుడూ అంత దిగులూ, విచారమూ నేను చూడలేదు!" అన్నారు ఈశ్వరయ్యగారు.

నాకు ఆశ్చర్యం వేసింది!

వాడికి కష్టాలా? బాధలా?

"పాపం, ఆ బిడ్డ బతుకుతుందో, లేదో!"

"అదేమిటి, మాస్టారూ? ప్రపంచంలో జబ్బు లెంతమందికి రావటం లేదు? అందరూ చచ్చిపోతున్నారా?"

"నీకు తెలీదు, బాబూ! ఆ జబ్బు అలాంటిది కాదు. ఎప్పుడో, ఏ క్షణానో పట్టి బెట్టుకుంటుంది! ఈ వయసులో రావలిసిన జబ్బుకాదు, బాబూ. టి. బి. అంటే మనిషిని కుమ్మరిపురుగులా తొలిచేస్తుంది!"

"ఏమిటి? ఆమెకు టి. బి. యా?"

"అవును, బాబూ! రాధ మూడేళ్లుగా మదనపల్లి శానిటోరియమ్‌లో బాధపడుతూంది. ప్రేమించి పెళ్లి చేసుకున్నారా దంపతులు. రెండేళ్లు కూడా జీవిత మాధుర్యాన్ని చవిచూడలేకపోయారు. ఉప్పెనలా ముంచుకువచ్చిందా జబ్బు. అతడేం తింటాడో ఏమో ఎవరికీ తెలీదు. జీతం డబ్బుల్లో చిల్లిగవ్వ తాకడు.


# విశ్వవిఖ్యాత జ్యోతిశ్శాస్త్ర వేత్తతో సంప్రదింపుడు!



స్వతంత్ర భారతావతరణము, పాకిస్తాన్ ప్రాదుర్భావము, ఆంధ్రప్రదేశ్ అవతరణము, భరత ఖండము భాషా ప్రయుక్త రాష్ట్రములుగ విభజింపబడుటయు, గాంధి, జిన్నా, పటేల్, నెహ్రూ, స్టాలిన్, లియాకతాలీఖాన్ మున్నగు వారి మరణోదంతములనే గాక నిన్న మొన్నటి ఈజిప్టు అధ్యక్షుడు నాసర్ అస్తమయమును, భారత ప్రధానిగ శ్రీమతి గాంధి నియామకము, కాంగ్రెస్ విభజనము, ముఖ్యమంత్రిగ శ్రీ చరణ్‌సింగ్ ఎన్నికయు, నిష్క్రమణమును, అమెరికా అధ్యక్షుడుగ శ్రీ నిక్సన్ ఎన్నికయు, శ్రీ వి. వి. గిరి భారత రాష్ట్రపతి యగుటయు, భారత్‌పై పాకిస్తాన్—చైనాల దురాక్రమణము — మున్నగు మహా సంఖ్యాక ఫలితములను జయప్రదముగ ప్రవచింప గల్గుటయేగాక ప్రముఖ వార్తాపత్రికల ప్రశంసలను పొందినదిగూడ ఈ మీ ఆంధ్రజ్యోతిశ్శాస్త్రవేత్తయే!

## ★ రు. 10—00 లకు మాత్రమే మీ జాతకం

ఇందు—తను, ధన, భూ, గృహ, విద్య, వాహన, సంతానములు, శత్రు—రోగ—ఋణములు, కళత్రం, ఆయుర్దాయములు, వృత్తి—ఉద్యోగ—వ్యాపారములను గూర్చి వివరింపబడును.

## ★ రు. 30—00 లకు ద్వాదశభావ ఫలములు

ఇందు—మీ మొత్తం జీవితంలో జరుగబోవు ముఖ్య సంఘటనలను ద్వాదశ భావ ఫలయుక్తముగ వివరింపబడును.

## ★ రు. 300 లకు సంపూర్ణ జాతకము

ఇందు ద్వాదశ భావ ఫలములను, దశాంతర్దశా ఫలితములను పలు భావములలో విదశా ఫల సూచనలను, దుష్టగ్రహ బాధా నివారణోపాయములను అత్యద్భుతముగ వివరింపబడును.

మా శాస్త్ర పటిమను పరీక్షింప దలచిన వారికిదొక మహదవకాశము!

సూచన:— పైవానిలో మీకు నచ్చిన పద్ధతి జాతకమునకు ఎం. ఓ. తో మీ జాతకం, జననకాల దశాశేషం పంపవలయును. జననకాల వివరాలు మాత్రమే పంపిన వారు రాశ్యంశ దశాశేషములను తయారుచేయుటకు అదనముగ రు. 5—00 జతచేసి పంపవలెను. అరచేతి ముద్రలు పంపిన వారు గూడ ఈ అదనపు చార్జి భరించవలయును. రిజిష్టరు పోస్టులో తమ ఫలితములు తెప్పించుకొనదలచిన వారు ఆ ఖర్చులను ఎం. ఓ. తో జతచేసి పంపవలయును. వచ్చిన ఆర్డర్లు వరుసక్రమముగ పంపబడును.

ప్రొఫెసర్ కె. ఎస్. స్వామి గాంధి నగరం - తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ-3 (ఏ.పి.)

అంతా భార్యకు పంపిస్తాడు. కౌన్సిలర్ కామేశంగారింట్లో ట్యూషన్ చెప్పి, లాయర్ విశ్వనాథంగారి ఆఫీసులో ఉత్తరాలు టైప్ చేసి పొట్ట పోసుకుంటాడు. టి. బి. అంటే మామూలు జబ్బు కాదు, బాబూ! శ్రీమంతులికి రావలిసిన జబ్బు."

నా తలమీద పిడుగుల వర్షం కురిసినట్లయింది.

"కామేశంగారింట్లో ట్యూషన్ చెప్పి, విశ్వనాథంగారి ఆఫీసులో ఉత్తరాలు టైప్ చేసి పొట్ట పోసుకుంటున్నాడా?"

"అవును, బాబూ! కొందరు కష్టాల కోసమే పుడతారు కాబోలు! రాజారావు పుట్టింది శ్రీమంతుల ఇంట్లోనే అయినా ఈతిబాధల్ని తప్పించుకోలేకపోయాడు. జీవితంలో సుఖమంటే ఏమిటో ఎరగడు. పురిటి మంచంలోనే కన్నతల్లిని పోగొట్టుకున్నాడు. సవితి తల్లి సాధింపులు భరించలేక ఎనిమిదో ఏటనే కట్టుబట్టలతో అమ్మమ్మ వద్దకు పారిపోయాడు. తండ్రి శ్రీమంతుడయినా అమ్మమ్మ పేద గంజే అతనికి అమృతప్రాయమైంది. అమ్మమ్మే అష్టకష్టాలు పడి, చిన్నవాణ్ణి పెద్దవాణ్ణి చేసింది. చిన్నభార్య నోటికి భయపడి అతని తండ్రి రాఘవయ్య సైతం రాజారావుకి న్యాయం చేకూర్చలేకపోయాడు. అతనికి మైనారిటీ తీరక ముందే ఆస్తి అంతా పడుచుపెళ్ళాం చేతుల్లో పెట్టి రాఘవయ్య తనువు చాలించాడు. ఆస్తి చేజిక్కించుకున్న సవితి తల్లి రాజారావుకి మొండిచెయ్యి చూపించింది. అందరూ అతణ్ణి మోసంచేసినవాళ్ళే, బాబూ. కానీ, అతడెవరికీ కీడు తలపెట్టలేదు. ఈనాడు రాధకూడా అతణ్ణి మోసం చేసి వెళ్ళిపోతే అతడేమైపోతాడో?" ఈశ్వరయ్యగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నా గుండె తరుక్కుపోయింది.

ఇన్ని బాధలూ, బాధ్యతలూ భరిస్తున్న రాజారావా అంత నిశ్చింతగా నవ్వగలుగుతున్నాడు?

అతని హృదయంలో ఎన్ని తుపానులు చెలరేగుతున్నాయో! ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయో!

జీవితాన్ని అంత బాగా వడబోశాడు కనకనే అంత నిశ్చింతగా నవ్వగలుగుతున్నాడు.

"రాధకూడా శ్రీమంతుల బిడ్డేనని విన్నాను. ఆర్థికంగా ఆ మామగారేమీ సాయం చెయ్యడా?" నా సందేహాన్ని బయటపెట్టాను.

"సాయం చెయ్యనవసరం లేదు, బాబూ! అనునయవాక్యాలు పలికితే చాలు! ఆ పసిహృదయాలు ఎంతగానో ఊరట చెందేవి. కాని, అతని హృదయం పాషాణం, బాబూ! రాధ, రాజారావు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. ఆ పెళ్ళి అతని కిష్టం లేదు. ఆ అక్కసు కొద్దీ ఆ దంపతులమీద కత్తిగట్టాడు. రాధ ఆ దిగులుతోనే మంచం ఎక్కింది. రాజారావు అతణ్ణి యాచించి ఉంటే దిగివచ్చేవాడేమో! కాని, రాజారావు అభిమానధనుడు. ఒకరి ముందు చెయ్యి చాచడం అతనికి చేతకాదు. ఆత్మశక్తి మీద అతని కున్న విశ్వాసమూ, ధైర్యస్థైర్యాలూ అందరికీ ఉండవు, బాబూ! అతడు మేరువులాంటివాడు!"

"అవును, మాస్టారూ! నిజం. ఇంత కాలంగా మే మతనితో స్నేహం చేస్తున్నా తన విషయాలేవీ మాతో ఎప్పుడూ చెప్పుకోలేదు. నిశ్చింతగా, నిర్మలంగా కనిపించేవాడు. అతని హృదయంలో ఇన్ని అగ్నిపర్వతాలు పేలుతున్నాయని మే మెన్నడూ ఊహించుకో లేదు. ఎంత హాయిగా, నిర్మలంగా నవ్వేవాడని!"

"నే నతనికి పరాయివాణ్ణి కాను, బాబూ! అతని తండ్రి రాఘవయ్య నా బాల్యమిత్రుడు! బాల్యమిత్రుడి కొడుక్కి నా చేతనయిన సాయం చేద్దామని సర్వవిధాలా ప్రయత్నించాను. కాని, నా ప్రయత్నం ఫలించలేదు. తన కష్టాలని నాతో సైతం చెప్పుకునేవాడు కాడు. ఎన్ని కష్టాలు పడ్డా, రాధ అతనికి దక్కితే చాలు! దేవుడనేవాడుంటే అతనికి అన్యాయం జరగకూడదు, బాబూ! రాధ అతణ్ణి మోసం చెయ్యదు!" ఈశ్వరయ్యగారు దేవుడి అస్తిత్వాన్నే శంకిస్తున్నట్టు శూన్యంలోకి చూస్తూ ఉండిపోయారు.

"దేవుడున్నాడు, మాస్టారూ! రాజారావుకి అన్యాయం జరగదు. రాధ బతికి తీరుతుంది. రాజారావు ఎప్పటిలాగే నిండుగా, నిర్మలంగా నవ్వుతూ హుషారుగా తిరుగుతాడు! నిజం, మాస్టారూ! నిజం!" పెల్లుబికిన దుఃఖాన్ని బలవంతాన ఆపుకుంటూ పైపంచె నోటికి అడ్డం పెట్టుకున్నాను.

రాజారావు నా కళ్ళముందు మహామేరువులా కనిపిస్తున్నాడు!

అతని ముందు మేమంతా గడ్డిపరకలం! మట్టిబెడ్డలం!

వెన్నెలజల్లులా, పూలవర్షంలా హాయిగా నవ్వుతున్నాడు.

ఎంత నిర్మలంగా ఉందా నవ్వు!

సెలయేటి సంగీతంలా, చైతన్య స్రవంతిలా!

రాజారావు నవ్వాలి! ఎప్పటిలాగే నవ్వాలి!

★



దీపసుందరి

ఫోటోలు- భరద్వాజ (మద్రాసు-18)

